



# బ్లేడు

అక్షగురి సువర్ణజ్యోతి



## జీవిత వివరాలు

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకా, "ఉండి గ్రామంలో నా బాల్యం, విద్యాభ్యాసం కూడా విజ్ఞానదాయకమైనటువంటి మహా పురుషుల జీవిత చరిత్రలుగల పుస్తకాలు చదవటం యందు ఆసక్తి. రేడియో కార్యక్రమాలనువిని ప్రతి వారం వాటి గురించి నా అభిప్రాయాలను తెలపటం నా కిష్టమైన అభిరుచి. ఇప్పటి వరకు రేడియోకి మాత్రమే వ్యాసాలు, కథానికలు వ్రాసేదాన్ని. కాని ఇప్పుడిప్పుడే పత్రికలకు వ్రాయటానికి ఉత్సాహపడుతున్నాను. దానికి మా అమ్మగారైన హరిప్రియగారి ప్రోత్సాహం ఎక్కువ సంగీతం, తోట పని, పుస్తక పఠనం నా హాబీలు.

ఎ. సువర్ణ జ్యోతి

రాత్రి ఏడు గంటలు అయింది. బస్‌లో కిటికీ దగ్గర కూర్చుని వున్నా. మహా విసుగ్గా వుంది నాకు ఎంతకూ రాని కండక్టర్, డ్రైవర్‌ల మీద. ఎందుకైనా ప్రయాణమంటే చాలా సరదా నాకు.

ఆ రోజు చాలాసేపటికి కండక్టర్ వచ్చాడు. వస్తూనే టిక్కెట్లివ్వడం పూర్తి చేసి టిక్కెట్లున్న చెక్కని తన సీటుపై వున్న అరలో పడేశాడు. దాని క్రింద వెలిగే చిన్న లైటు కాస్తా ఆ అదురుకి ఆరిపోయింది. దాంతో కండక్టర్ ఆ లైటు వెలిగించే ప్రయత్నంలో పడ్డాడు. ఎంతకీ వెలిగించలేకపోతున్నాడు. అంతా విసుగ్గా వున్నా ఉచితసలహాలివ్వవచ్చని ఉత్సాహంగా సలహాలిచ్చేస్తున్నారు. ఒకరిద్దరు అతనికి సహాయం చేసినా ఫలితం శూన్యం. టిక్కెట్లు తీసుకుని నిశ్చింతగా కబుర్లు చెప్పుకుంటున్నారు బస్‌లో జనాలు. ఇంతలో డ్రైవర్ వచ్చాడు "ఏంటోయ్" అంటూ. కండక్టర్ విశదీకరించాడు. "మీరు టిక్కెట్లివ్వడం పూర్తిచేశారు కదయ్యా! డ్రైవర్‌ని బండి నడపమను బాబూ! అన్నాడు ఒక ముసలతను. "నీకేం తండ్రీ! నువ్వు హాయిగానే కూచుంటావు కునికిపాట్లు పడుతూ లెక్కలెవడు చూస్తాడు నీ తాత?" వెలగని లైటుమీది కోపం ముసలతనిమీద చూపాడు. ఇంక దాంతో సలహాదాయుళ్ళు అందరూ నోళ్లు మూసుకుని కూర్చున్నారు.

ఆఖరి ప్రయత్నంగా డ్రైవర్ పరిశోధన మొదలుపెట్టాడు. ఐదు నిమిషాలు సీరియస్‌గా చూసి "బ్లేడు వుంటే ఇవ్వండి ఎవరైనా" అన్నాడు. వెంటనే క్షణాల మీద అంచెలంచెలుగా బస్‌లోంచి బ్లేడు వచ్చేసింది. ఎక్కడ ఫాల్ట్ వుందో చూసి వైర్ చివర్లు కోసి కనెక్షన్ ఇచ్చి అంతా సరిదిద్ది పది నిమిషాల్లో ఎలాగైతేనేం వెలి



# ఇంద్ర ధనుస్సు:

## గాడిదల క్లబ్

ఇంతకుముందు మనందరికీ లయన్స్ క్లబ్, రోటరీక్లబ్ వంటి వాటి పేర్లుతెలుసు అయితే యిప్పుడు "యాసెస్ (గాడిదలు) ఇంటర్నేషనల్" అనే ఒక కొత్తక్లబ్ ఆవిర్భవించింది కాలికట్‌లో. కొందరు యువకులు యేర్పాటుచేసిన ఈ క్లబ్ ఆశయాలు ఇంతకుముందు మనకువున్న



క్లబ్‌ల లక్ష్యాలకు పూర్తి వ్యతిరేకంగా వున్నాయి. ఈ క్లబ్ లక్ష్యం సామాన్య మానవుడికి క్లబ్‌లు సృష్టిస్తున్న సాంఘిక దుర్వ్యవస్త గురించి తెలియజెప్పడమట. ఈ నిర్వాహకులు తమ వుద్దేశ్యాలను పత్రికలవారికి ఒక మామిడిచెట్టు క్రింద ఏర్పాటు చేసిన సమావేశంలో స్పష్టంగా తెలియజేశారు. ఆ క్లబ్ సభ్యులుకూడా ఒకర్నొకరు "యాస్" అని పిలుచుకుంటారట!

## సూది – దారం

ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ క్వీన్స్ కళాశాలలో ప్రతి కొత్త సంవత్సరం రోజునా ప్రతి విద్యార్థికీ కూడా ఒక సూదినీ,దారాన్ని ఇవ్వటం సంప్రదాయం. 1340 లో ఈ కళాశాల ప్రారంభించినప్పట్నుంచీ దీన్ని సక్రమంగా నిర్వర్తిస్తూనే వున్నారు. దీనికంతటికీ కారణం—విద్యార్థులకు కళాశాల సంస్థాపకుని పేరు గుర్తుచేయాలనే ఉద్దేశ్యమట. ఆయన పేరు ఎంగ్లెష్ ఫీల్డ్. దానినే "ఎగిల్ ఫిల్" అంటారు. ఫ్రెంచ్‌లో ఇలా అంటే "సూది, దారం" అని అర్థమట!

—పరిటాల దుర్గా మల్లేశ్వరి

గించాడు. అందరూ హమ్మయ్యా! అనుకున్నారు. ఈ తతంగం జరుగుతుండగా బస్‌లో ఇంకా జనం వచ్చి నిల్చున్నారు.

ఆ కండక్టర్‌కి ముక్కుమీద కోపం ఉంటుందో లేక బస్సు ప్రయాణీకుల ముందు తను వెలిగించలేని లైటును డ్రైవర్ అతి సునాయాసంగా వెలిగించేసి ప్రపంచంమీద పడబోయిన స్కైలాబ్‌ను దారి తప్పించి సముద్రంలో పడేసిన శాస్త్రజ్ఞుని ముఖంలా వెలిగిపోతూన్న డ్రైవర్ ముఖం చూసో కండక్టర్‌కిచికాకు, కోపమూ రెండూ సమపాళ్ళలో వచ్చేశాయి. అంత కోపాన్ని దేనిమీద చూపాలో తెలియక విసురుగా తలెత్తిన అతనికళ్ళకి ఈ చివర బోనెట్ దగ్గరనుంచి ఆ చివర సీట్‌వరకు పైన కమ్మీలు పట్టుకుని వేళ్లాడుతున్న ప్రయాణీకులు కనిపించారు.

"సీట్లున్న వాళ్ళు, టిక్కెట్లున్న వాళ్ళు మాత్రమే ఈ బస్‌లో ప్రయాణం చెయ్యాలి, నించున్నవాళ్ళు దిగాలి" అని అరిచాడు. ఎవ్వరూ దిగలేదు- పైగా దిగమన్నారు కూడా. కండక్టర్ కోపానికి అగ్నిలో ఆజ్యంపోసినట్టు డ్రైవర్ అన్నాడు. "నేను కదా బండిని నడిపేది. పోన్లే! టిక్కెట్లియ్యి" సానుభూతిగా కండక్టర్ ఇంక లాభంలేదన్నట్లు అందరికీ టిక్కెట్లిచ్చాడు

ఉండి ఉండి బస్‌లో అతని అరుపుల్లాంటి మాటలు వినబడుతున్నాయి. "ఇదేంటయ్యా! ఈ నోటు మారదు, చిల్లరియ్యి- ఇక్కడేమైనా చిల్లర రాశులు వున్నాయనుకున్నావా? ఇదిగో నీ ఫుల్ టికెట్. ఈ మూటకి లగేజ్ టిక్కెట్టియ్యి" అని రకరకాలుగా టిక్కెట్ల కాండ పూర్తయింది. అసలైన రభస అప్పుడే ప్రారంభమైంది.

కండక్టర్ టిక్కెట్లివ్వడం పూర్తి చేశాక "అక్కడ బ్లేడు,వుంది ఎవరిదో అడిగి యిచ్చెయ్యి" అన్నాడు. కండక్టర్ బ్లేడు తీసి పైకెత్తి పట్టుకుని "ఎవరిదయ్యా ఈ బ్లేడు" ఎవరూ తీసుకోలేదు. "ఏంటయ్యా! ఎవరూ తీసుకోరు" అన్నాడు డ్రైవర్ బస్ స్టార్ట్ చేస్తూ. నాకూ ఆశ్చర్యం వేసింది. 'ఎవరూ తీసుకోరేమిటి? కొత్త బ్లేడు' అని. అంతలో ఎవరో అన్నారు. "బ్లేడెవరు తీసుకుంటారయ్యా! అది ఏ జేబు దొంగదో అయుంటుంది" అని. "జేబు దొంగెవరో బస్‌లో వున్నాడు, మీ సామాన్లు,వస్తువులు జాగ్రత్తగా చూసుకోండి" లౌడ్‌స్పీకర్ లాంటి కంఠం ఒకటి హెచ్చరికలు చేస్తోంది. అందరూ తమతమ సూట్‌కేసులు,సంచులు జాగ్రత్తపరచుకుంటున్నారు. నించున్న వాళ్ళుజేబులు గట్టిగాపట్టుకున్నారు. వెనక యెవరో జేబుదొంగల గురించి ఉపన్యసిస్తున్నారు. "దొంగల ముఠాలు బస్‌లో యెక్కి దారిమధ్యలో ఆపి కొల్లగొట్టుకోవడం పేపర్లలో చదవటంలేదూ! ఏవిటో కలికాలం!" అంతర్జాతీయ దొంగల ముఠా దగ్గరనుంచి రోడ్డుప్రక్క జంగిడీల్లోని జీళ్ళ దొంగతనం వరకూ పక్కవాళ్ళ గుండెలు భయంతో బేజారెత్తిపోయేటట్టు రకరకాల వ్యాఖ్యానాలు.

క్షణంలో 'బ్లేడు' ఆఫ్టరాల్ బ్లేడు, చిన్న రేకు ముక్కలాంటి బ్లేడు బస్‌లో అల్లకల్లోలం సృష్టించేసింది బస్ నడుస్తూనే ఉంది. బస్‌లో గందరగోళం "దొంగున్నాడంట బస్‌లో" కండక్టర్ ఇదేసందు అదేమందు అనుకున్నాడేమో. "ఐతే ఇప్పుడేమంటారయ్యా! బస్ ఆపి ఆ దొంగను దింపమంటారా! దొంగ మొహంమీద దొంగ అని వ్రాసుంటుందా?" గయ్యిమన్నాడు జనంమీద.

అందరికీ భయంగా ఉంది. కండక్టర్‌కి జడిసి మాట్లాడకుండా కూర్చున్నారు. ప్రస్తుతం కండక్టర్ వెలిగిన లైట్‌క్రింద సీట్‌లో కూర్చుని దర్జాగా వ్రాసుకుంటున్నాడు. బస్‌లో అందరూ ప్రక్కవాళ్ళే దొంగన్నట్టు మాటలాపేసి ఒకర్నొకరు సందేహంగా, భయంగా చూసుకుంటున్నారు.

నాకు మాత్రం "అదిగో పులి- ఇదిగో తోక" అనే సమాజాన్ని చూస్తే నవ్వొచ్చింది ఇటువంటి సమాజం ఇంక మారదేమో? అనిపించింది. ఒక వేళ ఎవరైనా మగ వాళ్ళు షేవింగ్ నిమిత్తం ప్రయాణంలో తీసుకెళుతున్నారేమో? ఇటువంటి సమయంలో చెప్పినా ఒక విధమైన ఫీలింగ్‌లోపడిన ప్రజలు వినరు. పైగా ఒక వేళ ఎవరేనా తీసుకున్నా తీసుకున్నవాడే దొంగంటారు. ఇదో రకం ప్రజ. ఇదండీ ఆ రోజు బస్‌లో జరిగిన సంఘటన. నేను మాత్రం క్షేమంగా ఇంటికి చేరుకున్నాను. కానీ అందరి హృదయాలలో రకరకాలుగా రూపుదిద్దుకున్న బ్లేడును చూసినా, గుర్తువచ్చినా పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వుకుంటాను.

